
# మళ్ళీ ఆ పొరపాటు చేయను

దూరి వెంకటరావు



"నమస్తే"

వచ్చిన వ్యక్తిని ఎగాదిగా చూశాడు సైక్రియాట్రిస్ట్ మురారి. అతడిని ఎప్పుడో ఎక్కడో చూసినట్లు గుర్తు. మనిషి అరటి దవ్వలా అర్భకంగా వున్నా మొహం గంభీరంగానే ఉంది.

"మీది మా కవరపాలెం కదూ" అన్నాడు జ్ఞప్తికి తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తూ.

"ఔను. నా పేరు ప్రవీణ్. మనం..."

"ఫిఫ్త్ క్లాస్ వరకు కలిసి చదువుకున్నాం. యామ్ ఐ కరక్ట్?"

"యస్. చెబితే గాని పోల్చుకోలేవేమో అనుకున్నాను" అన్నాడు ప్రవీణ్ నవ్వుతూ.

"అబ్బ, ఎన్నాళ్ళైంది. నిన్ను చూసి...రా...కూర్చో"

మిత్రుడి ఆప్యాయతకు మురిసిపోయాడు ప్రవీణ్. తన ప్రక్కన నిలబడ్డ భార్య సునందను పరిచయం చేశాడు.

రెండు చేతులు జోడించి "కూర్చోండి" అన్నాడు మురారి. ఆమె కూర్చోలేదు. నిలబడే దిక్కులు చూస్తోంది.

"క్షమించు. సునంద మన లోకంలో లేదు."

ప్రవీణ్ మాటలకు మురారి కనుబొమ్మలు ముడివడ్డాయి.

"బాబు పోయిందగ్గర నుంచి ఈమె ఇలా తయారైంది. నువ్వు సైక్రియాట్రిస్టువని తెలిసి నీ వద్దకొచ్చాను."

"అది సరే, నీ భార్య మతి స్థిమితం కోల్పోడానికి దారి తీసిన సంఘటనలేమైనా చెప్పగలిగితే నా శక్తి వంచన లేకుండా మళ్ళీ ఆమెను మామూలు మనిషిని చేయడానికి ప్రయత్నిస్తాను."

అతడి మాటలకు ఓ వేడి నిట్టూర్పు విడిచాడు ప్రవీణ్. నర్సుని పిలిచి సునందను అలా తోటలోకి తీసుకెళ్ళమని చెప్పాడు మురారి.

* * *

అది ఎమ్.పి.యు.పి స్కూలు.

అటెండెన్సు రిజిస్టరు పట్టుకుని ఆరో తరగతిలోకి అడుగు పెట్టారు నరసింహం మాస్టారు.

మాస్టారి రాకతో గోలగా వున్న క్లాసు గప్‌చిప్ అయిపోయింది. హాజరు వేసి బెత్తం పట్టుకుని లేచారు మాస్టారు.

ఎవర్ని ఏ పాఠం అప్పజెప్పమంటారోనని పిల్లలు అతడి వంక బిక్కుబిక్కుమని చూస్తున్నారు.

ముందు వరుసలో ఉన్న ఓ కుర్రవాణ్ణి నించోబెట్టి భర్తృహరి సుభాషితాల్లోని ఒక పద్యాన్ని అప్పజెప్పమన్నారు.

ఆ అబ్బాయి పద్యం చదువుతూ వుంటే మాస్టారికి వెనుక వరుసలో మాటలు వినిపించాయి.

"ఒరేయ్ కిట్టూ, వీడు పద్యం చదువుతూ ఉంటే నువ్వక్కడ ఏం



చేస్తున్నావురా?" నరసింహావతారమెత్తారు నరసింహం మాస్టారు.

"నేనేం చేయలేదండి. ఈ హర్షే నన్ను మాట్లాడిస్తున్నాడు" ఫిర్యాదు చేశాడు కిట్టు.

"హుం. వెర్రిబాగులోణ్ణి బళ్ళో వేస్తే ఇలాగే వుంటుంది" అనుకుంటూ హర్షవద్దకెళ్ళి అతడి వంక గుర్రుగా చూస్తు బెత్తం పైకెత్తారు మాస్టారు.

చేయి చాపాడు హర్ష.

ఫెడీ ఫెడీ మంది బెత్తం.

ప్రాణం జివ్వుమంటున్నా కిక్కురుమనలేదు హర్ష. తన తప్పును హర్షమీదకు నెట్టేసి శిక్ష తప్పించుకున్నందుకు సంతోషంగా ఉంది కిట్టుకి.

బిడ్డ చేయి బూరెలా ఉబ్బిపోవడం చూసి గుండె బాదుకుంది సునంద.

"ఎవర్రా నిన్నింత నిర్దాక్షిణ్యంగా కొట్టింది? మాస్టారేనా?" అడిగింది.

అవునన్నట్లు తల ఊపాడు హర్ష.

"అభంశుభం తెలియని మన బిడ్డను ఆ మాస్టారు గొడ్డును బాదినట్లు ఎలా చావాబాదాడో చూడండి. అదే తన కొడుకైతే ఇలాగే కొట్టేవాడా?" భర్త ఇంటికి రాగానే నూటొక్క రాగం తీసింది సునంద.

పిల్లవాడి అరచేయి చూసి చలించిపోయాడు ప్రవీణ్. పిల్లల కోసం ఆ దంపతులు నోచని నోములు లేవు. చేయని యాత్రలంటూ లేవు. ఎట్టకేలకు సంతానం మీద ఆశ వదులుకున్న తరుణంలో హర్ష పుట్టడంతో వాళ్ళ జీవితంలో వేయి వసంతాలు వెల్లివిరిసాయి. అయితే ఆ దంపతులు చేసుకున్న పాపం ఏమిటో మరి. బిడ్డ ఎదుగుతున్నా వాడి బుద్ధి మాత్రం వికసించడం లేదు. ఎప్పుడు చూసినా బెల్లం కొట్టిన రాయిలా స్తబ్దుగా వుంటాడు. పిల్లల్లో సహజంగా ఉండే గడుసుతనం గానీ, చలాకీతనం గానీ వాడిలో కనిపించవు. ఎవరేమన్నా వాడికి కోపం రాదు. పౌరుషం తలెత్తదు.

మాష్టారి చర్యకు ఉగ్రుడైన ప్రవీణ్ బడికెళ్ళి తన కొడుకు చేసిన తప్పేమిటో చెప్పమన్నాడు.

ఇందులో హర్ష తప్పేమీ లేదని, కిట్టూయే ముందుగా అతడిని మాట్లాడించారన్నారు పిల్లలు.

"మరి ఆ సంగతి చెప్పరేమ్రా" అంటూ ప్రవీణ్ చేతులు పట్టుకుని క్షమాపణ చెప్పారు మాస్టారు. అంతే కాదు మరోమారు ఇటువంటి పొరపాటు జరగదని హామి ఇస్తూ దీనికంతటికీ కారకుడైన కిట్టూ నడ్డి విరగ్గొట్టారు.

దెబ్బతిన్న పాముయ్యాడు కిట్టు. సమయం చూసి హర్ష మీద బుసగొట్టాలనుకున్నాడు.

✻ ✻ ✻

సన్నిహితులు సలహా మేరకు గంపెడాశతో కొడుకును తీసుకుని హైదరాబాదు వెళ్ళి సైక్రియాటిస్టుకు చూపించారు ప్రవీణ్ దంపతులు.

హర్షని రకరకాలుగా పరీక్షించి "చెప్పండి" అన్నాడు సైక్రియాట్రిస్టు శివకుమార్.

"అదేమిటో డాక్టరు గారూ, ఏళ్ళు వస్తున్నా వీడికి బుద్ధి మాత్రం పెరగడం లేదు" అన్నాడు ప్రవీణ్.

"మీ వంశంలో బుద్ధి మాంద్యం గలవారెవరైనా ఉన్నారా?"

"ఊహూ! వీడెందుకిలా తయారయ్యాడో తెలీడం లేదు" ఆవేదన వ్యక్తం చేశాడు ప్రవీణ్.


"బుద్ధి మాంద్యం అన్నది వారసత్వం వల్లగానీ, రోగాల వల్లగానీ లేక శరీరానికి దెబ్బలు తగలడం వల్లగానీ రావచ్చు. ఐక్యు స్థాయి డెబ్బై కంటే తక్కువ ఉంటే వారిని బుద్ధి మాంద్యం ఉన్నవారిగా గుర్తించడం జరుగుతుంది. వీళ్ళు నిదానంగా ప్రతిస్పందించడం, శరీరాభివృద్ధిలో తేడాలుండటం, ఇతరులకు సహకరించకపోవడం, ఏకాగ్రత లేకపోవడం, స్వయంగా నిర్ణయాలు తీసుకోలేకపోవడం వంటి లక్షణాల్ని కలిగి ఉంటారు. ఇలాంటి వాళ్ళను మూడు తరగతులుగా వర్గీకరించవచ్చు. మొదటి తరగతికి చెందిన వారు శిక్షణకు పనికిరారు. వీరి శాతం ఇటువంటి రోగుల్లో అయిదు మాత్రమే ఉంటుంది. వీరు పూర్తిగా తన వారి మీదే ఆధారపడి ఉంటారు. ఇక రెండవ తరగతికి చెందిన కేసులు ఇరవైశాతం ఉంటాయి. వీరికి శిక్షణ ఇచ్చి మార్చవచ్చు. ఇక మూడవ తరగతికి చెందిన డెబ్బై అయిదు శాతం కేసుల విషయంలో వీరికి విద్యనందించి పూర్తిగా సాంఘిక జీవనాన్ని గడిపే వారిగా చేయవచ్చు. మీ అబ్బాయి విషయానికొస్తే

## మగాడి అవసరం లేదు

'నాకు ఏ మగాడి అవసరం లేదు' అంటోంది 'మురారి' ముద్దుగుమ్మ సొనాలీ బింద్రే. 'స్త్రీలు పెళ్ళి చేసుకుంటేగానీ బ్రతకలేని రోజులు పోయాయి' అని పెద్ద ఉపన్యాసాలు ఇస్తోంది. అమీర్‌ఖాన్, సునీల్ శెట్టి, అభిషేక్ బచ్చన్‌లతో రాసలీలలు సాగించిన సొనాలి బింద్రే ఇప్పుడే పెళ్ళి చేసుకునే ఉద్దేశ్యం లేదంటోంది. ప్రస్తుత ప్రియుడు గోల్డీ బెహల్‌తో మీ వ్యవహారం ఎంత వరకూ వచ్చిందంటే 'పెళ్ళి చేసుకుంటే అందరికీ చెప్పే చేసుకుంటాను' అని మాట దాటేస్తోంది.

## అమృత అయిడియా

అమృతా అరోరా ఫారిన్ షూటింగ్‌కి వెళ్ళటానికి తన రక్షణకై తమ పరివారాన్నంతటినీ విదేశాలకు తీసుకువెళ్ళాలని పట్టుబడుతోందట. కానీ సుభాష్‌ఘాయి దీనికి ఒప్పుకోలేదట. అమృత షూటింగ్ చేస్తున్న సమయంలో కుటుంబ సభ్యులెవరూ రావడానికి వీల్లేదని కండిషన్ పెట్టాడట. దీనితో అమృత అయిడియా ఫ్లాప్ అయి సుభాష్ ఘాయి చెప్పినట్లు చేస్తోందట.



ఇతడు రెండు కోసకు పెరుగుతాడు" అంటూ ఆగాడు శివకుమార్.

"ఎంత ఖర్చు అయినా పరవాలేదు. మావాడిని మీరే బాగు చేయాలి" అంది సునంద.

"తప్పకుండా. అయితే మీ వాడిని రెండు మూడేళ్ళపాటు ఇక్కడ ఉంచవలసి ఉంటుంది.

ఆ మాటకు అదిరి పడింది సునంద.

"వద్దు. నా బాబును విడిచి ఒక్క క్షణం ఉండలేను. వాడెలా వున్నా పరవాలేదు. నా దగ్గరుంటే అంతే చాలు" బిడ్డను గుండెలకు హత్తుకుంది.

చేసేదేం లేక భార్యాబిడ్డలతో తిరుగు ముఖం పట్టాడు ప్రవీణ్.

* * *

బడికెళుతున్న కిట్టూకి ఏడుస్తూ ఎదురయ్యాడు హర్ష.

"ఏరా హర్షా! ఎందుకేడుస్తున్నావ్?" అడిగాడు కిట్టు.

" కుక్క కరిచింది" ఏడుస్తూనే జవాబిచ్చాడు హర్ష. వాడి స్థితికి జాలి వేసినా గతంలో వాడి మూలంగా మాస్టారి చేత దెబ్బలు తిన్న కారణంగా మంచి పని అయిందనుకున్నాడు కిట్టు. అయితే ఆ భావం బయటకు కనపడనీయకుండా 'అయ్యో పాపం' అంటూ రక్తం తుడిచి జేబు రుమాలుతో కట్టు కట్టాడు.

బాధ తగ్గినట్లు అనిపించడంతో ఏడుపు మానేశాడు హర్ష.

"నువ్వు ఇక్కడే ఉండు. ఇప్పుడే వస్తాను" అంటూ వాడిని ఓ గట్టు మీద కూర్చోబెట్టి స్కూలుకెళ్ళాడు కిట్టు.


"మాస్టారూ! పిచ్చి కుక్క కరిస్తే ఏమౌతుంది?" అడిగాడు సైన్సు మాస్టారి దగ్గరికెళ్ళి.

"ఇంజక్షన్లు చేయించుకోకపోతే చస్తాడు. కొంప తీసి ఎవరికైనా కుక్క కరిచిందేవి(టా?" కంగారుగా అడిగాడు మాస్టారు.

"అబ్బే! ఊరికే , అడిగాను" అంటూ తుర్రుమన్నాడు కిట్టూ. వాడి మనసులో ప్రతీకార జ్వాల రగులుతోంది.

"పద వెళదాం. ఇంట్లో ఎవరితోనూ కుక్క కరిచిందని చెప్పకు" అంటూ హర్ష చేయి పుచ్చుకుని వాడిని ఇంటి వరకు దిగబెట్టాడు కిట్టు.

పడటం వల్ల హర్షకు గాయమై ఉంటుందనుకుని పై పూతకు మందులు రాసి ఊరుకున్నారు ప్రవీణ్ దంపతులు. కొన్నాళ్ళకు గాయమైతే తగ్గింది కాని హర్ష ప్రవర్తన మాత్రం



## గొప్ప మనసు

నాగార్జున 'సంతోషం' చిత్రం హిట్ అవడంతో మాటల రచయిత దశరథ్ అయినా సహకరించిన త్రివిక్రమ్‌ను మెచ్చుకుని మంచి బహుమతి ఇచ్చాడు. అంతేకాకుండా అన్నపూర్ణా బ్యానర్‌పై రూపొందుతున్న 'మన్మథుడు' చిత్రానికి రచయితగా అవకాశం ఇచ్చి, ఆయనకు ఇప్పటివరకూ తెలుగు ఇండస్ట్రీలో ఎవ్వరూ ఇవ్వనంత పారితోషికం ఇచ్చాడుట. నాగార్జున గొప్పమనసును గురించి ఇండస్ట్రీలో గొప్పగా చెప్పుకుంటున్నారు.

వింతగా మారిపోయింది.

బిడ్డ చేష్టలకు ఆశ్చర్యపోయి డాక్టర్ని పిలుచుకొచ్చాడు ప్రవీణ్.

పిచ్చి కుక్క కరవడం వల్ల రాబీస్ ఎటాకైందన్నాడు డాక్టరు.

ఆ మాటకు అదిరిపడ్డాడు ప్రవీణ్. సునంద స్పృహ కోల్పోయింది.

హర్ష జబ్బు తగ్గడానికి ఎంత ఖరీదైన వైద్యమైనా చేయించడానికి సిద్ధంగా వున్నానన్నాడు ప్రవీణ్.

అతడి మాటలకు డాక్టరు పెదవి విరుస్తూ "రాబీస్ రాకుండా నిరోధించేందుకు మందులున్నాయి గానీ వచ్చేక మనమేవరం చేయగలిగిందేమీ లేదు. బిడ్డకు చేరువై సేవలందించాలంటే మీరు కూడా యాంటీ రాబీస్ ఇంజక్షన్లు చేయించుకోవలసి ఉంటుంది. లేకపోతే ఆ జబ్బు మీకు కూడా వ్యాప్తి చెందే ప్రమాదముంది" అని హెచ్చరించాడు. ప్రవీణ్‌కి చేతులు కాళ్ళు చల్లబడిపోయాయి. వైద్యుడన్నట్లే మరో రెండ్రోజుల్లో పిలుపు అందనంత దూరానికి తరలిపోయాడు హర్ష.

* * *

"అప్పటి నుంచే ఈమె ఇలా తయారైంది. బాబు వయసున్న పిల్లాడినెవరినైనా తెచ్చుకుని ఇంట్లో పెట్టుకుంటే సునంద మళ్ళీ మామూలు మనిషి అయ్యే అవకాశముందని కొందరు సలహా ఇచ్చారు. ఆ ఆశతో కుర్రవాడి కోసం అన్వేషణ ప్రారంభించాను. అబ్బాయి ఆటవస్తువా? బజార్లో కొనుక్కురావడానికి? అయినా పట్టు వీడకుండా రక్త సంబంధీకులందర్నీ అడిగి చూశాను. ఏ ఒక్కరూ తమ బిడ్డను నాతో పంపడానికి అంగీకరించలేదు. చివరికి నా తోడల్లుడు తాతారావు తన కొడుకు శ్రీనుని పంపేందుకు ఒప్పుకున్నాడు. అందుకు ప్రతిగా తన కుటుంబాన్ని పోషించాలన్నాడు. అతడికి ఉద్యోగం లేదు. పైగా వ్యసన పరుడు. అర్ధాంగి క్షేమం కోసం అతడు విధించిన షరతులన్నిటికీ ఊ కొట్టాను.

శ్రీను ఇంట్లో తిరుగాడుతుండటంతో సునందలో రవంత మార్పు కనిపించింది. వ్యసన పరుడైన తాతారావుకి ఎంతిచ్చినా చాలదంటూ డబ్బు కోసం రోజూ గొడవ చేయడం ప్రారంభించాడు. అతడి ప్రవర్తనకి విసిగిపోయి కోపాన్ని అణచుకోలేక నోరు విప్పాను. అంతే! పిల్లాడిని తీసుకుని వెళ్ళిపోవడానికి సిద్ధమయ్యాడు. అప్పుడప్పుడే కొద్ది కొద్దిగా కోలుకుంటున్న భార్య కోసం మరికొంత కాలం ఉండమని బ్రతిమలాడాను. తిక్కరేగిన తాతారావు నిప్పు తొక్కిన కోతిలా గెంతులేస్తూ భార్య బిడ్డల్ని తీసుకుని వెళ్ళిపోయాడు. ఇప్పుడు చెప్పు మురారీ! నువ్వైనా నా సునందని నాకు దక్కేటట్లు చేయగలవా?" అంటూ స్నేహితుడి కళ్ళలోకి బేలగా చూశాడు ప్రవీణ్.

"నువ్వేం దిగులు పడకు. నీ భార్యని మళ్ళీ మామూలు మనిషిని చేసే బాధ్యత నాది. కాకపోతే ఆమెను కొంత కాలం ఇక్కడే ఉంచవలసి ఉంటుంది" అన్నాడు మురారి.

"నీ ఇష్టం ఎంత కాలమైనా పరవాలేదు. నా భార్యని తిరిగి ఇదివరకటి సునందని చేస్తే అంతే చాలు. ఒకసారి ఇలాగే బిడ్డమీద మమకారంతో కొడుకును విడిచిపెట్టి ఉండలేక వాడిని కాలం కాటుకు బలి ఇచ్చాను. మళ్ళీ ఆ పొరపాటు చేయను" అంటూ తన జీవిత భాగస్వామిని విడిచిపెట్టి ఒంటరి జీవితాన్ని సాగించేందుకు ప్రయాణమయ్యాడు ప్రవీణ్.